క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్లు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం రైల్వేస్టేషన్ వద్ద కొలువై ఉన్న శ్రీ పోలేరమ్మ వార్షిక తిరునాళ్లు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యుత్ ప్రభతో పాటు మ్యూజికల్ నైట్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, మజ్జిగలను పంపిణీ చేశాయి.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నేడు

చీరాల: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి మంగళవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

మొబైల్ బుక్ కీపింగ్‌తో ప్రయోజనం

చీరాల టౌన్: రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్ నిర్వహించాలని ఏపీఎం బి.సుబ్బారావు సూచించారు. మంగళవారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య సభ్యులతో మాట్లాడారు. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి నెలా 10న సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రజా సేవతో సంతృప్తి

వేటపాలెం: పీహెచ్‌సీల్లో పనిచేసే వైద్యులు, వైద్య సిబ్బంది ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య సూచించారు. మంగళవారం వేటపాలెం, పందిళ్లపల్లి పీహెచ్‌సీలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాల్లో రికార్డులు పరిశీలించారు. వైద్యశాల్లో బెడ్‌ల కొరత లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఇటీవల డాక్టర్ వైద్య సిబ్బంది మధ్య జరుగుతున్న సంఘటలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాంటి సంఘటనలు తిరిగి పునరావృత్తం కాకుండా చూడాలని తెలిపారు. కాలం చెల్లిన మందులు వైద్యశాల పరిధిలో లేకుండా చూసుకోవాలన్నారు. రోగులకు మందులు ఇచ్చే క్రమంలో దానిపై ఉన్న గడువు తేదీలను గమనించి వారికి ఇవ్వాలన్నారు. వీరి వెంట ఎంపీడీఓ శర్మ ఉన్నారు.

విధులు బహిష్కరణ

చీరాల రూరల్ : బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తీరును నిరసిస్తూ మంగళవారం న్యాయవాదులు సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కోర్టులకు హాజరుకాని, ప్రాక్టీస్ చేయని న్యాయవాదులకు కూడా వెల్ఫేర్ ఫండ్ కట్టుకునేందుకు అవకాశం ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్ బాబు, కొటిక ఉదయ భాస్కర రావు తెలిపారు.

డ్రైవింగ్‌లో ఏకాగ్రత ముఖ్యం

చీరాల రూరల్: వాహనాలు నడిపే సమయంలో వాహనదారులు చాలా ఏకగ్రతగా ఉండాలని ఐఎల్‌టీడీ పర్సనల్ మేనేజర్ విజయ లక్ష్మి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. సేఫ్టీ మేనేజర్ ఎంఎస్ఎన్. రెడ్డి, బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జి.కె. ఈశ్వరి రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సకల జీవుల ఆరోగ్యం ముఖ్యం


మాట్లాడుతున్న అధికారి ఎం శ్రీనివాసరావు

అద్దంకి: మనుషులు, జంతువులు, పక్షులతో పాటు సకల చరాలు ఆరోగ్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సీఈవో ఎం. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలోని ట్రెనింగ్ సెంటర్‌లో ఆయన వన్‌నేషన్ వన్ హెల్త్ (ఒకే ప్రపంచం ఒకటే ఆరోగ్యం) కోసం పౌల్ట్రీ రంగం అందులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో పక్షులు, పశువులు మనుషులు వేరువేరుగా చూడాల్సిన అవసరం లేదన్నారు. అవన్నీ ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. ముఖ్యంగా సిఫార్సు మోతాదు మించి వాడిన యాంటీ బయాటిక్స్ వల్ల పశువులు, మనుషుల ఆరోగ్యానికి చేటని చెప్పారు. యాంటీ బయాటిక్స్‌ను వైద్యులు సూచించిన మేరకు మాత్రమే వాడాలన్నారు. అంతకు మంచి ఎక్కువైతే వివిధ రకాల వ్యాధులు పశువులకు, వాటి పాలు తాగిన మనుషులకు వస్తాయని హెచ్చరించారు. పౌల్ట్రీ యజమానులు పర్యావరణం ప్రభావితం చేసే సవాళ్లను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. ముందస్తుగానే పక్షులకు పశువులకు వచ్చే వ్యాధుల గురించి తెలుసుకుని జగ్రత్త వహిస్తే ఆయా రోగాలు రాకుండా చూసుకోవచ్చని చెప్పారు. జంతువులు, పక్షులు ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. పశు సంవర్ధక శాఖ బాపట్ల జిల్లా అధికారి హనుమంతరావు మాట్లాడుతూ పక్షులు, పశువుల ఆరోగ్యంతో మానవ ఆరోగ్యం ముడిపడి ఉందన్నారు. దాన్ని తెలుసుకుని నడుచుకోవాలన్నారు. ఏడీ మోహనరావు మాట్లాడుతూ జంతువులు, మానవులకు సంబంధించి ముందస్తు సంరక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. తరువాత ఆర్టిడ్స్ సెక్రటరీ యర్రా సాంబశివరావు మాట్లాడారు. పౌల్ట్రీ యజమానులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి జయంతి


కావడితో వెళుతున్న చిన్నారి

కారంచేడు: సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి జయంతి పురస్కరించుకొని నాగేంద్రస్వామి పుట్ట కమిటీ ఆధ్వర్యంలో భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పాల కావిళ్ళతో గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. మాస్కో బజారు రెండు చెరువుల కట్ట మీద ఉన్న స్వామివారి పుట్ట నుంచి బయలుదేరిన ఊరేగింపు గ్రామంలోని అన్న ప్రధాన వీదుల్లో నిర్వహించారు. పెద బజారు శివాలయం అర్చకులు కారంచేటి వీరాంజనేయ శర్మ సమక్షంలో నిర్వహించిన పూజల్లో భక్తులు పాలు, గంధం నీళ్ళతో కావిళ్ళు తయారు చేసి గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

కావడితో మొక్కులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని కృష్ణంరాజువారిపాలెం (రెడ్డిపాలెం) గ్రామంలో కొలువై యున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఆషాఢమాసంలో నిర్వహించే ఆడికృత్తిక వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇది తమిళనాడులో ప్రసిద్ధి. ఓ చిన్నారి మేదరమెట్ల నుంచి కావడి ధరించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరి వంగడాలపై అవగాహన

పర్చూరు (చినగంజాం): బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వరి రకాలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. చెరుకూరులోని ఏరువాక కేంద్రం సమన్వయకర్త బాల మురళీధర్ నాయక్, డాక్టర్ ఎం.ఉష, ఎస్.మోహనరావు, దాసరి ఉషారాణి, వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, కారుమంచి విజయకుమార్, గ్రామ కార్యదర్శి కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

చిల్లర దొంగలు హల్‌చల్

● రెండు దుకాణాల్లో చోరీకి విఫలయత్నం


కిరాణాషాపు తలుపు పగల గొట్టడానికి యత్నించిన దొంగలు

వేటపాలెం: మండల కేంద్రం వేటపాలెంలో చిల్లర దొంగలు హల్ చల్ సృష్టిస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి ఒన్‌వే రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డుల్లో గల రెండు షాపుల తలుపులు గడ్డ పొలుగుతో పగల గొట్టే ప్రయత్నం చేశారు. అయితే తలుపులు పగలక పోవడంతో గడ్డపొలుగు అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ చిల్లర దొంగలు దుకాణాలను టార్గెట్ చేస్తున్నారని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. సీసీ కెమెరాలు కొన్ని ప్రాంతాల్లో పనిచేయడం లేదని వాటికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. దీంతో దొంగలు రెచ్చిపోతున్నారు.

పాడి రైతులకు గడ్డి విత్తనాలు సిద్ధం

బల్లికురవ: మండలంలోని బల్లికురవ, అంబడిపూడి, ఉప్పుమాగులూరు పశువైద్యశాలల పరిధిలోని పాడి రైతులకు గడ్డి విత్తనాలు ఉచితంగా అందజేయనున్నారు. ఈమేరకు పశువైద్యాధికారులు పి. మహేశ్వరరావు, ఆర్. పావని కుమారి, మంగళవారం తెలిపారు. ఎన్‌డీడీబీ ఆధ్వర్యంలో సీఎస్ హెచ్ 24 ఎంఎఫ్ రకం కేజీల మినీ కిట్ ఒక్కో రైతుకు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆధార్ కార్డు, ఫోన్‌నంబర్, పాల కార్డుతో వెంటనే వైద్యశాలను సంప్రదించాలని వైద్యాధికారులు కోరారు.

పుస్తక విజ్ఞానం అపారం


జన విజ్ఞానవేదిక పుస్తకాలతో విద్యార్థులు

అద్దంకి: పుస్తక పఠనంతో విజ్ఞానం అపారంగా పెరుగుతుందని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి తంగా శ్రీనివాసరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి మ్యాగజైన్‌లను మంగళవారం కాకానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. నాలుగు మాస పత్రికలను స్కూలుకు ఉచితంగా అందజేస్తానని బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు ప్రకటించారు. ఈ పుస్తకాలు చదవడం వల్ల మూఢ విశ్వాసాలు పోతాయని.. సైన్స్ వివరణలు తెలుసుకోవచ్చని చెప్పారు. ప్రతి విషయాన్ని గుడ్డిగా నమ్మవద్దని చెప్పారు. హెచ్ఎం ఎస్‌సీహెచ్ గురవయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో బాపట్ల జిల్లా జేవీవీ ఉపాధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, కావూరి రఘుచంద్, సీహెచ్ కృష్ణారెడ్డి, సోము అనురాధ, సందిరెడ్డి పద్మావతి, ఈశ్వరమ్మ, సురేష్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం సమష్టి బాధ్యత

మార్టూరు: మాదక ద్రవ్యాలు, ప్లాస్టిక్ వినియోగ నివారణకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు సయ్యద్ కరిముల్లా అన్నారు. వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాట్లాడారు. కొండపల్లి వెంకయ్య, గడ్డం మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయులు కేసినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆడదూడల ఉత్పత్తితో అధిక పాల దిగుబడి

అద్దంకి: సెక్స్ సార్టెడ్ చమన్ ప్రక్రియతో పశువులకు ఆడ దూడలు మాత్రమే పుడతాయని ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ సీఈవో ఎం. శ్రీనివాసరావు అన్నారు. వెంపరాలలో మంగళవారం నిర్వహించిన పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరంలో ఆయన మాట్లాడారు. సెక్స్ సార్టెడ్ చమన్ వలన నూరు శాతం ఆడదూడలు పుడతాయని దీనివల్ల పశువుల ఉత్పత్తి పెరడంతోపాటు, పాల దిగుబడి పెరుడుతుందన్నారు. అదే విధంగా పశువ పోషకులకు లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. పశు సంవర్ధక శాఖ బాపట్ల జిల్లా అధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు, డాక్టర్ బి. రవికుమార్, ప్రకాశం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ ఎం. రమేష్ బాబు, అద్దంకి సహాయ సంచాలకుడు డాక్టర్ ఎం. మోహనరావు, సర్పంచ్ వెంకాయమ్మ, బొమ్మనంపాడు పశు వైద్యాధికారి ఏలూరి అశోక్, కొరిశపాడు వైద్యాధికారి క్రాంతికిరణ్, మేదరమెట్ల వైద్యాధికారి ఎం. సైదయ్య, 1962 అంబులెన్స్ సిబ్బంది, గోపాలమిత్రలు, పశు సహాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు వేగవంతం


పంగులూరులో పారిశుద్ధ్య పనులు

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు జరిగాయి. గ్రామంలోని మురుగు కాలవల్లో నీరు నిలిచిపోయి దోమలు ఈగలు ఏర్పడి సీజనల్ వ్యాధులకు కారణం అవుతున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో గ్రామంలోని దళిత కాలనీల్లో ఉన్న మురుగు తీస్తున్నారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లటం, పొగ ద్వారా దోమలను పారదోలే పని చేపడతామని గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ రామారావు తెలిపారు. ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సీజనల్ వ్యాధులు వస్తున్న నేపథ్యంలో పనులు ముమ్మరం చేయాలని, సమావేశం తీర్మానించింది. ప్రస్తుతం గ్రామంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయి. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు కూడా ఎక్కువగా ఉన్నాయని, నీటిలో క్లోరినేషన్ చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

నకిలీ పురుగు మందులు విక్రయిస్తే చర్యలు


కారంచేడులో ఎరువులు, పురుగుమందులు తనిఖీ చేస్తున్న ఏఓ సుధీర్‌బాబు

కారంచేడు: రైతులకు నష్టం కలిగించేలా నకిలీ ఎరువులు, పురుగు మందులను విక్రయించే దుకాణాలు, వారి యజమానులపై కేసులు నమోదు చేసి లైసెన్స్‌లు రద్దు చేస్తామని వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు అన్నారు. కారంచేడులోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాక్, కంపెనీలు, వాటికి ఉండే అర్హతలు, లైసెన్స్‌లను ఆయన క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఒక దుకాణంలో ప్రిన్సిపాల్ సర్టిఫికెట్‌లు లేని సుమారు రూ. 65 వేల విలువ చేసే నిల్వలను ఆయన గుర్తించి సీజ్ చేశారు. గ్రామంలో ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే అన్నదాతలు కూడా కొనుగోలు సమయంలో కచ్చితంగా బిల్లులు తీసుకోవాలన్నారు.

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న రాజా సాల్మన్


మాట్లాడుతున్న జడ్జి ప్రశాంతి

చీరాల రూరల్: మానవవ అక్రమ రవాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని షాడోస్ సంస్థ ప్రతినిధి న్యాయవాది ఎ. రాజా సాల్మన్ అన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక వైఏ ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల, షాడోస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో రాజా సాల్మన్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. మురళి మాట్లాడారు. మానవ అక్రమ రవాణా సమాజంలోని పేదరికం, నిరక్షరాస్యత కారణంగా జరుగుతుందని చెప్పారు. సమాజంలోని పేదరికం నిర్మూలన కావాలంటే ప్రతి ఒక్కరూ అక్షరాస్యత సాధించాలని సూచించారు. ఎవరైతే చదువుకుని మంచి ఆలోచనతో ఉంటారో వారు పేదరికాన్ని జయిస్తారని చెప్పారు. కొంతమంది విద్యార్థినిలు టీవీలు, సెల్‌ఫోన్‌లు, ఇంటర్‌నెట్‌లు వంటిపై దృష్టి సారించి చదువు విషయంలో వెనుకబడి పోతున్నారని, అంతేకాక వాటి వలన చెడు మార్గాలలోకి వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొంత మంది అమ్మాయిలు పోకిరీలు చెప్పే మాయ మాటలకు లోబడి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమం తరపున ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థినులతో చైతన్యం కలిగిస్తామని ఎన్ఎస్ఎస్ బాధ్యులు భారతి పేర్కొన్నారు. ఫిజికల్ డైరెక్టర్ నీలా కుమారి, కళాశాల సిబ్బంది, షాడోస్ స్టాఫ్ భాగ్య లక్ష్మి, అలేఖ్య, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నివారణే లక్ష్యం

అద్దంకి రూరల్: మానవ అక్రమ రవాణా అరికట్టాలని న్యాయవాది మహమ్మద్ రఫీ అన్నారు. మానవ అక్రమ రవాణావ్యతిరేక దినోత్సవాన్ని న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో స్థానిక హర్షిణి కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ బాలబాలికలు, యువతుల అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలపట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. హర్షిణి కళాశాల లెక్చరర్ జ్యోతి రమేష్‌బాబు, లాయర్ ఎం. ప్రకాష్ పాల్గొన్నారు.

బాలికలు జాగ్రత్తగా ఉండాలి

పర్చూరు (చినగంజాం): మాయమాటలు చెప్పేవారి పట్ల బాలికలు తగు జాగ్రత్తగా ఉండాలని పర్చూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రశాంతి అన్నారు. బాలికల అక్రమ రవాణాను అందరూ అరికట్టాలని ఆమె పిలుపునిచ్చారు. స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.శ్రీరమణి, చార్జి తహల్దార్ శ్రీనివాసరావు. న్యాయవాదులు పాల్గొన్నారు.

వాసవి సేవలు విస్తృతం చేయండి


వీధి వ్యాపారుకులకు గోడుగు అందిస్తున్న జిల్లా గవర్నర్

వేటపాలెం: వాసవీ క్లబ్ సేవలు విస్తృతం చేయాలని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ పేర్ల సత్యనారాయణ సూచించారు. మంగళవారం వేటపాలెంలో జరుగుతున్న వీసక్లబ్ సేవాకార్య క్రమాలను ఆయన పరిశీలించారు. ముందుగా కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. వాసవీ క్లబ్ వారిచే నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలను ప్రారంభించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో వీధి వ్యాపారులకు ఎండకు ఉపయోగించుకొనే విధంగా గొడుగులు అందజేశారు. అనంతరం దేశాయిపేటలో గల అనాథ వృద్ధ శరణాలయంలో వృద్ధులకు ఉచిత భోజనం అందజేశారు. దత్తసిద్ధి క్షేత్రంలో మొక్కలు నాటారు. వల్లంపట్ల మురళీకృష్ణమూర్తి, దేవన మనోజ్‌కుమార్, హర్షవర్ధన్, సీతా రామాంజనేయ వరప్రసాద్, సెనగపల్లి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మొక్కలు పర్యావరణ నేస్తాలు


మొక్కలు నాటుతున్న రోటరీ అధ్యక్షుడు సభ్యులు

అద్దంకి: మొక్కలు విస్తారంగా ఉండాలని, దాని వల్ల పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు వీరయ్య అన్నారు. చెరువుకొమ్ముపాలెం వాటర్ ట్యాంకు వద్ద, మలాది శ్రీనివాసరావు సౌజన్యంతో 18 రకాల పండ్లు, పూలు, నీడ నిచ్చే మొక్కలను పాఠశాలలో నాటారు. రోటరీ అధ్యక్షుడు మాట్లాడుతూ చెట్లతో మానవ మనుగడ ఉంటుందని లేకుంటే భవిష్యత్తులో అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ చుండూరు మురళి సుధాకర్ రావు, పాస్ట్ ప్రెసిడెంట్ చిన్ని మురళీకృష్ణ, రోటరీ సభ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అళహరి హరిప్రసాదు, కొల్లిపర నాగయ్య, ప్రిన్సిపాల్ రత్తయ్య పాల్గొన్నారు.



1న పింఛన్ పంపిణీ

చినగంజాం: సామాజిక పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా అందించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. 6002 మంది లబ్ధిదారులకు 2 కోట్ల 53 లక్షల రూపాయలు పంపిణీ చేయాలని తెలిపారు.

విజయలక్ష్మి సేవలు ప్రశంసనీయం


విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా 36 సంవత్సరాలు సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన చిల్లర విజయలక్ష్మి సేవలు అనిర్వచనీయమని మండల విద్యాశాఖాధికారులు పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పి.సుధారాణి అన్నారు. మంగళవారం స్థానిక పేరాలలోని గోలి సదాశివరావు కళ్యాణ మండపంలో విజయలక్ష్మి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కడవకుదురు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కుర్రా రామారావు, హెచ్ఎంలు బి.సాల్మన్, కె.కృష్ణమోహనరావు, ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్స్ వి.ప్రభాకరరావు, జి.అనిల్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన కౌలు వేలం పాట

పర్చూరు(చినగంజాం): మండలంలోని చెరుకూరులో గల త్రివిక్రమ, శ్రీ అగస్త్యేశ్వర స్వామి వార్ల దేవస్థానం మాన్యం భూముల బహిరంగ కౌలు వేలం పాట ముగిసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నాగయ్య మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



● వరుణుడే ఆదుకోవాలి


వల్లాపల్లిలో అచ్చుతోలుతున్న రైతులు

ఖరీఫ్ దాటి పోతున్నా ఇప్పటికీ పొలాలు పదునయ్యే వర్షం కురవడం లేదు. దీంతో వరుణుడిపై భారం వేసి విత్తనాలు విత్తటంతోపాటు మిర్చి, వంగ, టమోటా నాట్లకు రైతులు సమాయత్తం అవుతున్నారు. మండలంలోని వల్లాపల్లి, చిన అంబడిపూడి, పెద అంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాల్లో మెట్ట భూముల్లో కంది, పత్తి, కూరగాయాల సాగుతోపాటు మిర్చి, వంగ, టమోటా సాగు కోసం సిద్ధం అవుతున్నారు. దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్న రైతులు సోమ, మంగళవారాల్లో కురిసిన చిరు జల్లులకు ఎడ్ల ఎకరలతో అచ్చుతోలుతున్నారు.

– బల్లికురవ

